క్లుప్తంగా

చీడ పురుగుల నుంచి పంటలను రక్షించుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు వ్యవసాయంలో సస్య రక్షణ పద్ధతులు పాటించి పంటలను చీడ పురుగుల నుంచి రక్షించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కొండాపురం, ముడుమాల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల్లో రైతులతో సమావేశం నిర్వహించి ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. అదేవిధంగా పంట పొలాలను ఏఓ పరిశీలించి సాగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈపీఈఓ వెంకటేష్, భాస్కర్, సునంద వీఏహెచ్ శశిదేవి, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలి


వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సి.బెళగల్: మండల కేంద్రంతోపాటు గ్రామాలలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించుకోవాలని వీఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ముడుమాల మద్దిలేటి పిలుపునిచ్చారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని వాల్మీకి రామాలయంలో మంగళవారం మండల వాల్మీకి కమిటీ సభ్యులు, నాయకులు, ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సి.బెళగల్, సంగాల మాజీ సర్పంచ్‌లు చిన్న మునెప్ప, నాగన్న, వార్డు సభ్యుడు గొర్ల మద్దిలేటి, వాల్మీకి నాయకులు పెద్ద మునెప్ప, లక్ష్మన్న, రంగన్న, పాండు, నరసింహుడు, గొర్ల పాండు, గుంటెప్ప, ఓబులేషు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో మాజీ ఎమ్మెల్యే పూజలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుబ్బారెడ్డి, అర్చకులు కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: కంది సాగులోమెలువకులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ సుధాకర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని లొద్దిపల్లె, భైరాపురం గ్రామాలలో ఆయన పర్యటించారు. కంది పంటను పరిశీలించిన ఏఓ తెగుళ్ల సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ క్రాప్ జాబితాను రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించామని, ఏమైనా తప్పులు ఉంటే బుధవారంలోపు సరిచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఆనందలక్ష్మి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి అన్నారు. పల్లెపండగ–పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొంగనపాడు, నాయకల్లు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ నాగిరెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, పీఆర్ ఏఈ రవి మోహన్‌రెడ్డి, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకులు మాదేశ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల చెంత.. పల్లెల్లో సంత!

- మౌలిక వసతులు లేక ఇక్కట్లకు గురవుతున్న వ్యాపారులు, ప్రజలు
- అత్యవసరాలకు తప్పని తిప్పలు

ఓర్వకల్లు: గ్రామ పంచాయతీలకు సంత మార్కెట్లు ఆదాయ వనరులుగా దోహదపడుతున్నాయి. అలాంటి సంత మార్కెట్లను పంచాయతీ అధికారుల ఉదాసీనత కారణంగా సమస్యల చెంతకు నెట్టుతున్నాయి. మండలంలో ఓర్వకల్లు, శకునాల, హుసేనాపురం గ్రామాలలో వారపు సంతలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు ప్రకారం 5 వేల జనాభా ఉన్న గ్రామాలలో వారపు సంతలు ఏర్పాటు చేసుకునే అవకాశం వుంటుంది. ఒకవేళ ఒక గ్రామంలో సరిపడా జనాభాలేకపోతే సమీప గ్రామ జనాభా ప్రాతిపదికన సంత మార్కెట్ నిర్వహిస్తారు. అయితే సంతమార్కెట్లలో కనీస వసతులు కరువై ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఓర్వకల్లు సంత మార్కెట్...

మండల కేంద్రం ఓర్వకల్లులో ప్రతి శనివారం వారపు సంత నిర్వహించేందుకు 2016లో పంచాయతీ అమోదించడం జరిగింది. మండలంలోని కన్నమడకల, తిప్పాయపల్లె, గుట్టపాడు గ్రామాల ప్రజలు ఈ సంతకు వస్తారు. ఆ రోజుల్లో కూరగాయల మార్కెట్‌ను ప్రత్యేకంగా మండల పరిషత్ నిధుల నుంచి రూ.1.50 లక్షలు వెచ్చించి నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రస్తుతం ఆ మార్కెట్ నిరుపయోగంగా మారింది. దీంతో రచ్చకట్ట వద్ద గల బహిరంగ రోడ్లపైనే వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు, కిరాణం తదితర సరుకులు, వస్తువుల అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత మార్కెట్ నిర్వహణ కోసం గ్రామ పంచాయతీ అధికారులు ఈ ఏడాది నిర్వహించిన బహిరంగ వేలంలో ఓ వ్యక్తి రూ.1.80 లక్షలకు దక్కించుకున్నారు. వచ్చిన నిధులతో కొంత గ్రామాభివృద్ధికి వినియోగించగా, మరి కొంత సొమ్మును మౌలిక వసతుల కల్పనకు వినియోగించాల్సి ఉంది. అయితే ఇక్కడ కనీస వసతులు కల్పించకపోవడంతో వ్యాపారస్తులు, వినియోగదారులు అసౌకర్యాల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. మురుగు కాల్వల పక్కనే కూరగాయలు, ఆకుకూరలపై దోమలు, ఈగలు వాలి అపరిశుభ్రతకు గురవుతున్నాయి.


రచ్చకట్ట చుట్టూ కూరగాయలను విక్రయిస్తున్న దృశ్యం


మూతపడిన కూరగాయల మార్కెట్

హుసేనాపురం మార్కెట్

మండలంలోని అతిపెద్దది హుసేనాపురం సంత మార్కెట్. రామాలయం దగ్గర ప్రతి సోమవారం జరిగే ఈ సంతకు కాల్వ, ఎన్ కొంతలపాడు, సోమయాజులపల్లె, పాలకొలను, చింతలపల్లె, హెచ్ కొట్టాల, గ్రామాల ప్రజలు వస్తుంటారు. అయితే ఈ మార్కెట్‌కు ఇంత వరకు గ్రామ పంచాయతీ తీర్మాణం చేయకపోవడం గమనార్హం. ఆనాటి నుంచి నేటి వరకు స్థానికులే అనధికారంగా సంతను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బహిరంగ వేలం పాడేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో మౌలిక వసతులను కల్పించలేక పోయారు. గతేడాది ఓ వ్యక్తి రూ.1.50 లక్షలకు వేలం పాడి నగదును చెల్లించలేనని చేతులు ఎత్తివేయడంతో పంచాయతీ అధికారులు తిరిగి వేలం నిర్వహించగా అదే వ్యక్తి కేవలం రూ.80 వేలకు దక్కించుకున్నట్లు అధికారుల సమాచారం.

శకునాలలో

మండలంలోని శకునాల గ్రామంలో గత దశాబ్ద కాలం నుంచి అనధికారంగా సంత మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ఊరువాకిలి దగ్గర ప్రతి శుక్రవారం జరిగే సంతకు సమీప గ్రామాలైన బ్రాహ్మణపల్లె, గుమ్మితం తండ, తిప్పాయపల్లెల ప్రజలు వస్తుంటారు. ఇక్కడ కూడా ఎలాంటి మౌలిక సదుపాయలు కల్పించక పోవడంతో వ్యాపారస్తులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఈ సమస్యలు మరింత జఠిలమని వ్యాపారస్తులు వాపోతున్నారు.

మరుగు దొడ్లు నిర్మించాలి



ప్రతి శనివారం జరిగే సంతకు వచ్చే ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాలి. మహిళలకు మరుగు దొడ్లులేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్‌లో మరుగు దొడ్లు, బాతురూములు నిర్మిస్తే బాగుంటుంది. అత్యవసర పరిస్థితుల్లో పడే ఇబ్బందులు చెప్పలేక కుమిలిపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా మౌలిక వసతులను కల్పిస్తే బాగుంటుంది.

– ఉసేన్‌బి, దినుసుల వ్యాపారి, హుసేనాపురం

మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి



మేము నియోజకవర్గంలోని ఎన్నో సంతమార్కెట్లకు వెళ్లి కూరగాయలను అమ్ముకొని జీవిస్తున్నాం. మాలాంటి వ్యాపారస్తులకు సంత మార్కెట్లు ఉపాధి కల్పిస్తున్నాయి. అయితే ఓర్వకల్లు మండలంలో జరిగే సంత మార్కెట్లలో సదుపాయాలు కల్పించలేదు. దీంతో చాలా మంది మహిళలు సంతకు రాలేకపోతున్నారు. వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. ఓర్వకల్లులో మూతపడిన కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తెస్తే మాలాంటి కూరగాయల వ్యాపారులకు ఉపయోగకరంగా వుంటుంది.

– శివకుమార్, కూరగాయల వ్యాపారి, పాణ్యం

వర్షం కురిస్తే నష్టపోవాల్సిందే



వారపు సంతల్లో ఎక్కడకూడ షెడ్లు నిర్మించకపోవడంతో ఆరుబయటనే వ్యాపారం నిర్వహించాల్సి వస్తుంది. కూరగాయలు ఎండకు, వానకు దెబ్బతినడంతో నష్టాలకు గురవుతున్నాం. వర్షాకాలంలో మరింత నష్టపోవాల్సివస్తుంది. మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. అధిక ధరలకు కొనుగోలి చేసి, వారపు సంతల్లో అమ్ముకుంటే ఎంతో కొంత లాభం వస్తుందని కూరగాయలను సంత మార్కెట్లకు తీసుకెళ్తాం. అయితే సంత మార్కెట్లలో కనీస వసతులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నాం.

– శకుంతల, కూరగాయల వ్యాపారి, హుసేనాపురం

రైతులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం మూలంగా భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పుసులూరు గ్రామంలో నిర్వహించారు. పంటల కోతలు, విత్తనాలు వేయడం వారం రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు.

అమ్మవారికి వెండి పూజా సామగ్రి అందజేత


అమ్మవారికి వెండి వస్తువులను సమర్పిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్ : గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో వెలసిన శ్రీసుంకులా పరమేశ్వరీ అమ్మవారికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన శివయ్య, సుజాత దంపతులు వెండి పూజా సామగ్రిని అందజేశారు. రెండు వెండి ప్లేట్లు, ప్రసాదం గిన్నె, వెండి దీపాలు బహూకరించారు. ఆలయ పూజారులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వాదాలను అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గడివేముల: ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట రమణ సూచించారు. మండల కేంద్రమైన గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ డాక్టర్‌తో సహా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి నిరుపేదలకు వైద్యం అందించాలన్నారు. పీహెచ్‌సీల్లో ఓపీ తగ్గుతుందని, ఆరోగ్య కార్యకర్తలు ప్రభుత్వం అందించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 104,108 అంబులెన్స్‌ల ద్వారాల అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని రికార్డులను, ల్యాబ్, మందులు, కాన్పుల గదిని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవానలి మెడికల్ అఫీషసర్ డాక్టర్ కిరణ్‌కు సూచించారు. ఆరోగ్య సర్వేను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, స్టాఫ్‌నర్సులు తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న హేమలత

కల్లూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం చిన్నటేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. చేతుల పరిశుభ్రత ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఆరోగ్య విద్యాబోధకురాలు స్వర్ణగౌరి, ఆరోగ్య పర్యవేక్షకులు మద్దమ్మ, ఆరోగ్య కార్యకర్త విజయ కుమారి, ఆశా కార్యకర్తలు రజని, వెంకటేశ్వరమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ఓర్వకల్లు: మండలంలోని కొమరోలు, వెంకటాపురం, సోమయాజులపల్లె, చెన్నంశెట్టిపల్లె గ్రామాలలో అభివృద్ధి పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. పల్లెపండుగ–పంచాయతీ వారోత్సవాలలో భాగంగా ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, గోకులం షెడ్ల నిర్మాణాలకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలలో జాతీయ ఉపాధి నిధులతో అభివృద్ధి పనులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు రామచంద్రుడు, జయమ్మ, వివిధ శాఖల ఇంజినీర్లు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సోమయాజులపల్లెలో భూమి పూజ చేస్తున్న సర్పంచ్ జయమ్మ

మోతాదుకు మించి పురుగు మందులు వాడరాదు


రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : సాగులో మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులను వాడరాదని ఏఓ రవిప్రకాష్ రైతులకు సూచించారు. మండలంలోని గోరంట్ల గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏఓ నిర్వహించారు. పత్తి, కంది, ఆముదం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ రైతులకు వివరించారు. ఏఓ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న వేళ రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పంటలు దెబ్బతినకుండా పొలాల్లో వాననీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. యేటేటా పంటమార్పిడి చేసుకోవాలని, భూసార పరీక్షల ఆధారంగా విత్తనాల ఎంపిక, ఎరువులు వాడాలని సూచించారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

సి.బెళగల్: ప్రభుత్వ స్థలాలను అనుమతులు లేకుండా ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. డీటీ పురుషోత్తం, సర్వేయర్ నాగభూషణం, రెవెన్యూ అధికారులతో కలిసి తహసీల్దార్ మంగళవారం మండల కేంద్రం సి.బెళగల్‌లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మోడల్ స్కూల్ బస్టాండ్ దగ్గర ప్రభుత్వ స్థలంలో వేసిన బండలను పరిశీలించారు. ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేయాలని డీటీని ఆదేశించారు. అదేవిధంగా సర్వే నంబర్ 362లో పచ్చిక బయళ్లను కొంతమంది ఆక్రమించుకోవడంతో పాటు, గ్రావెల్‌ను అక్రమంగా తరలించినట్లు మైనింగ్ అధికారుల సమాచారంపై తహసీల్దార్ విచారణ చేశారు. పచ్చికబయళ్లలో ఎలాంటి ఆక్రమణ, తవ్వకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటేష్, సాయిరమణ, సర్వే అసిస్టెంట్ తిరుమలనాయుడు, వీఆర్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ స్థలంలో వేసిన బండలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

నేడు చౌడేశ్వరీ జ్యోతుల మహోత్సవం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో బుధవారం రాత్రి జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తొగట వీర క్షత్రియ సంఘం సభ్యులు మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. ప్రతియేటా దసరా పర్వదినం అనంతరం ఐదు రోజులకు జరిగే కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకాధి పూజలు, కుంకుమార్చన, మహానైవేద్యం, భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. అర్ధరాత్రి నుంచి అమ్మవారికి జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి జ్యోతుల మహోత్సవాన్ని జయప్రదం చేయగలరని వారు పిలుపునిచ్చారు.

శ్మశాన వాటికలలో వసతులు కల్పించాలి

ఓర్వకల్లు: శ్మశాన వాటికలలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు శ్మశాన వాటికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన శ్మశాన వాటికలు ముళ్ల పొదలు, కంపచెట్లతో నిండిపోయాయని, అంత్యక్రియల నిమిత్తం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటకైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికల్లో వసతులు కల్పించాలని, ఆక్రమణలకు గురికాకుండా ప్రహారీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు మహేష్, బొజ్జన్న, శివరాముడు, శ్రీనివాసులు, సేక్షావలి, దేవరాజు, రఫీ, శాలుబాష పాల్గొన్నారు.

పంచలింగాలలో 'పల్లె పండుగ'


భూమి పూజలో ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు (రూరల్) : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో మంగళవారం అభివృద్ధి పనులకు ఎంపీ బస్తిపాటి నాగరాజు భూమి పూజ చేశారు. అదేవిధంగా జి.శింగవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. రూ.9.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

ఎర్రదొడ్డి, అమడగుంట్లలో....

కోడుమూరు రూరల్ : మండలంలోని ఎర్రదొడ్డి, అమడగుంట్ల గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లు, అధికారులు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాముడు మాట్లాడుతూ ఎర్రదొడ్డిలో రూ.6.30లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్లు, అమడగుంట్లలో రూ.32లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎర్రదొడ్డి, అమడగుంట్ల సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, వరలక్ష్మి, పీఆర్ ఏఈ గంగరాజు, ఈఓఆర్డీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

నేడు లద్దగిరి, అనుగొండలో పల్లె పండగ

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని లద్దగిరి, అనుగొండ గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రాముడు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఇష్ట దైవాన్ని స్మరించుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గడిగరేవులలో సుంకులా పరమేశ్వరీ, గంగమ్మ దేవర కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేకు నిర్వాహకులు, సర్పంచ్ బీఎస్ రామ్మోహన్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరూ పని ఒత్తిడి ప్రభావం వలన మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేయడం, తమ ఇష్ట దైవాన్ని ఆరాధించడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. హిందూ ప్రచీనా కళలు, సంస్కృతి, సాంప్రదాయల కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. ఎక్కడైతే ఆలయాల్లో నిత్యం పూజలు జరుగుతుంటాయో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శివరామిరెడ్డి, భోగేశ్వర చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు గోదా ప్రసాద్, బాలచెన్ని, కో–లప్షన్ సభ్యుడు ఉశేన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గని ఆనంద్, చంద్రమౌళీశ్వరరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మేఘనాధరెడ్డి, ఏరాసు హరినాథరెడ్డి, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దేవర కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పల్లె పండుగలకు ప్రజా స్పందన కరువు

సి.బెళగల్: టీడీపీ కూటమి ప్రభుత్వం 14వ తేదీ నుంచి చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సి.బెళగల్ మండలంలోని కంబదహాల్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అభిషేకం గ్రామ సచివాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేయగా ప్రజలు ఆసక్తి చూపలేదు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ జనం ఎవ్వరు రాకపోవడంతో 11:20 గంటలకు కేవలం ఆరు మంది పొదుపు మహిళలు, సచివాలయ ఉద్యోగులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధికారులు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ఉపాధిహామి ఏపీఓ రామన్న మాత్రమే హాజరయ్యారు. ప్రజలతోపాటు అధికారులు సైతం పల్లె పండుగకు రాకపోవడంతో కార్యక్రమాలు బోసిపోతున్నాయి. అదేవిధంగా చింతమానుపల్లె, పలుకుదొడ్డి గ్రామాల్లోనూ పల్లె పండుగ కార్యక్రమానికి స్థానికుల నుంచి ఆశించిన స్థాయిలో ప్రజలు హాజరు కాలేదు.


సి.బెళగల్ మండలం కంబదహాల్ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో ప్రజలు లేని దృశ్యం

టెట్‌కు 21మంది గైర్హాజరు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన టెట్ పరీక్షకు 21మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ–2సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 60మందికి గాను 49మంది, మధ్యాహ్నం నిర్వహించిన టెట్ పరీక్షలకు 100మందికి గాను 90మంది హాజరయ్యారని చెప్పారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

కోడుమూరు రూరల్ : చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరంగా ఉంచవచ్చునని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప సూచించారు. మంగళవారం 'గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే' ను పురస్కరించుకుని చేతుల శుభ్రతపై కోడుమూరు బాలుర హైస్కూల్ విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్‌ఈఓ మాట్లాడుతూ చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా శ్వాసకోశ వ్యాధులైన జలుబు, దగ్గు, నిమోనియో, క్షయ, జీర్ణకోశ వ్యాధులైన టైఫాయిడ్, అతిసారా, డయేరియా వంటి వాటిని నివారించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసప్ప

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పునరావాస కేంద్రాన్ని మంగళవారం అధికారులతో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. నూతన భవన సముదాయాలు, గదులకు విద్యుత్ సౌకర్యం తదితర వసతులపై తహసీల్దార్ ఆరా తీశారు. అదేవిధంగా నదితీర గ్రామాల ప్రజలు వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని, 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని, ఏవైనా ఇబ్బందులు ఉంటే 9502375208 నంబర్‌ను సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు.

పాఠశాల నిర్వహణపై తహసీల్దార్ ఆగ్రహం

మండల కేంద్రం సి.బెళగల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహణపై తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించిన సందర్భంలో పాఠశాల ఆవరణం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం నిల్వలు, వినియోగంపై ఆరా తీశారు. రికార్డులు, భోజన నిర్వహణలో ఉపాధ్యాయులు పర్యవేక్షణ లోపాన్ని గుర్తించిన తహసీల్దార్ వారిపై మండిపడ్డారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటేష్, రఫీ, తిమ్మన్న, సాయిరమణ, ఎస్‌ఎంసీ చైర్మన్ గోవిందు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.


పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి